అధిక ఫీజులకు నిరసనగా.. ధర్నా

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 24: విద్యార్థుల ఫీజులకు సంబంధించి యాజమాన్యం ఆశకు అంతు లేకుండా పోయిందని పాఠశాల ఎదుట మంగళవారం తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని డాన్‌బాస్కో హైస్కూల్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచేసి విద్యార్థుల నుంచి గుంజుతున్నారని అన్నారు. నాలుగైదేండ్లుగా ఫీజుల దోపిడీకి దిగారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల విషయమై ఏటా యాజమాన్యంతో సంప్రదిస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం పట్టించుకొని పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై అక్కడి కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా యాజమాన్యం సూచనల మేరకే విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

శంషాబాద్ మున్సిపాలిటీలో ఆరు గ్రామ పంచాయతీలు విలీనం

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : శంషాబాద్ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు ఆరు గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను సంబంధిత అధికారులతో కలిసి స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ మండలంలోని ఘాన్సిమియాగూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమిదుల్లానగర్, రషీద్‌గూడ, బహదూర్‌గూడ గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకోవడంతో పాటు పెద్దగోల్కొండ గ్రామ పంచామతీ కార్యాలయానికి మున్సిపాలిటీ బ్యానర్ ఏర్పాటు చేశారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మణికొండ, సెప్టెంబర్ 24: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గడంటలకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ కస్తూరి నరేందర్ అధ్యక్షతన శంకుస్థాపన చేసేందుకు ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. 7వ వార్డులోని వైఎస్ఆర్ కాలనీలో రూ.12 లక్షలతో ఓపెన్ జీమ్, 17వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన, 16వ వార్డులోని ఎంప్లాయీస్ కాలనీలో రూ.34 లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్ 1వ ఫ్లోర్ ప్రారంభం, ఎంప్లాయీస్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో రూ.42 లక్ష వ్యయంతో కొనుగోలు చేసిన బకెట్ మౌంటెడ్ క్రేన్ ప్రారంభం, 15వ వార్డు హనుమాన్ నగర్ కాలనీలో రూ.48 లక్షలతో, సుహా అపార్ట్‌మెంట్ నుంచి శ్రీ సాయి రెసిడెన్సీ వరకు సీసీ రోడ్డు, ప్యాచ్ వర్క్ పనులకు శంకుస్థాపన, మణికొండ పరిధిలో కోటి రూపాయల అంచనా వ్యయంతో వట్టినాగులపల్లి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే కంపోస్ట్ షెడ్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 24: మహాత్మనగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్సీఆర్ హిల్స్ ప్రాంతంలోని మహాత్మనగర్, హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-1, ఇందిరానగర్, సంజయ్‌నగర్, హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2, శ్రీరాంనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ పేర్కొన్నారు.

నిధులు మంజూరైనా నిర్మాణానికి నిర్లక్ష్యం

తవ్వకాల్లో బయటపడ్డ పురాతన వ్యవసాయబావి

- తవ్వకాల్లో బయటపడ్డ పురాతన బావి
- నిర్మాణాన్ని నిలిపివేసిన అధికారులు
- మేయర్ ఇలాకాలో సమస్యకు పరిష్కారం చూపని వైనం
- ఆవేదన చెందుతున్న స్థానికులు
- నిద్రమత్తులో అధికారులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 : మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎన్‌బీటీనగర్‌లో మహిళా భవన్ నిర్మాణం ముందుకు సాగడం లేదు. మహిళా సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, స్తానిక మహిళలు సమావేశం నిర్వహించుకోవడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు నాలుగేండ్ల క్రితం ఎన్‌బీటీ నగర్‌లో మహిళా భవన్‌ను ప్రతిపాదించారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు 300 గజాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ జీ+1 భవనం నిర్మించేందుకు నిర్ణయించారు. ఈ భవన నిర్మాణానికి ప్రస్తుత మేయర్, డివిజన్ కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. తాజాగా గత నెల 30న భవన నిర్మాణం కోసం త్వకాలు చేపట్టగా, ఈ స్థలంలో ఓ పురాతనమైన వ్యవసాయ బావి బయటపడింది. దీంతో మహిళా భవన్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. ఒక వేళ భవనాన్ని నిర్మిస్తే అది తట్టుకుంటుందో లేదో అన్న సందిగ్ధంలో అధికారులు జీ+1ను విరమించుకున్నట్లు తెలిసింది. రోజులు గడస్తున్నా నిర్మాణం ఎలా చెపట్టాలని అధికారులు తలలు పట్టుకోగా, వర్షాకాలంలో అందులో నీరు చేరి ప్రజలకు ప్రమాదకరంగా పరిణమించింది. దానికి తోడు రోజుల తరబడి నీటిని తోడకపోవడంతో డెంగీ, మలేరియా వ్యాధులను వ్యాపింప చేసే దోమల లార్వాలకు ఆవాసంగా మారింది. ఎన్‌బీటీనగర్ గతంలో వ్యవసాయ క్షేత్రంగా ఉండేది. పూర్వం ఈ ప్రాంతాన్ని రేషమ్ బాగ్‌గా పిలిచే వారు. పట్టు పురుగులను పెంచేందుకు గాను ఇక్కడ మల్బరీ మొక్కలను నాటి ఈ బావి ద్వారానే నీరు అందించే వారు. కాలక్రమేనా ఈ ప్రాంతం అభివృద్ధి చెందగా, ఈ వ్యవసాయ భూములన్నీ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయాయి. 2011 ఫిబ్రవరి 4న నాడు మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ బావిలోనే అంగన్‌వాడి కేంద్రాన్ని నిర్మించేందుకు శంకస్తాపన చేశారు. కాని అది నిర్మాణానికి నోచుకోలేదు. ఏండ్ల తరబడి ఈ బావి అలాగే ఉండడంతో ప్రమాదవశాత్తు అనేక మంది అందులో పడిపోతుండడంతో దానిని మూసివేశారు.

ఇక్కడ బావి ఉండేదని తెలిసినా ..

ఇక్కడ బావి ఉండేదని తెలిసినా తాజాగా ఇదే స్థలాన్ని సంబంధిత శాఖ అధికారులు మహిళా భవన్ నిర్మాణానికి ఎంపిక చేశారు. అధికారులు అదే స్థలాన్ని కేటాయించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ప్రతిపాదిత మహిళా భవన్ నిర్మాణానికి రూ.57లక్షలు మంజూరైనట్లు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. నిదులు మంజూరైనప్పటికీ డివిజన్ కార్పొరేటర్, మేయర్ ఒ మహిళ అయి ఉండికూడా భవన నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

డీసీపీ విజయ్ కుమార్‌కు సీసీ కెమెరాలను అందజేసిన ఫార్మా సంస్థ ప్రతినిధులు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 24 :నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వీటి ఏర్పాటుకు వ్యాపార, వాణిజ్య, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎస్.ఆర్ నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్.ఆర్ నగర్ డివిజన్‌కు రూ.10 లక్షలు విలువచేసే సీసీ కెమెరాలు, ఇన్‌స్టాలేషన్ సామగ్రిని అమీర్‌పేట మైత్రీ విహార్‌లోని ఐజియంట్ ఫార్మా సంస్థ ప్రతినిధులు అందజేశారు. సంస్థ సీఎండీ శ్రీనివాస్ వర్మ రుద్రరాజు, డైరెక్టర్ సౌమ్య రుద్రరాజులు కమ్యూనిటీ సీసీటీవీ ప్రాజెక్టు కోసం సీసీ కెమెరాలను మంగళవారం ఎస్.ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్, ఏసీపీ పి.వెంకటరమణలకు అందజేశారు. ఈ కెమెరాలను బోరబండ పోలీసు స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్లు ఏసీపీ తెలిపారు. కాలనీలు, బస్తీలు, వాణిజ్య సముదాయల ప్రాంతాల్లో అందరూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ వెంకటరమణ పిలుపునిచ్చారు.

'మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి'

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సమస్యలను వివరిస్తున్న మార్కండేయనగర్ కాలనీ వాసులు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 24: ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ వెల్లడించారు. మార్కండేయనగర్ కాలనీ వాసులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేశారు. వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారాయని, డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరి మురుగు నీరు రోడ్లపై పారుతుందని అన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయని తెలిపారు. లో ప్రెషర్ మంచినీటి సరఫరా కారణంగా నీరు సరిపోవడం లేదన్నారు. పారిశుధ్యం సమస్యలు ఎక్కువవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలు, కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తానని అన్నారు. త్వరలోనే మార్కండేయనగర్ కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనను శాలువాతో సత్కరించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, ఏరువ సత్యనారాయణ, కోట జగదీశ్, కాళీదాస్, పగిడిమర్రి సూర్యనారాయణ, వీడం రమేశ్, శిరం దాస్, నరేందర్, కోట శ్యామ్‌కుమార్, కోట పవన్, అంజయ్య, విజయ్‌యాదవ్, ధనుంజయ్, ఉడుత సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే ఆరోగ్యానికి నాంది

మానవ హారంలో పాల్గొన్న కళాశాల అసోసియేట్ డీన్ డా. నరేందర్, విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 24: వీధులన్నీ శుభ్రంగా ఉండేలా ప్రభుత్వ సహకారం ఉంటే దేశం ఆరోగ్యకరంగా ఉంటుందని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాల అసోసియేట్ డీన్ డా. నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ సేవాపథకంలో విభాగంగా (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకిని విద్యార్థులు చేపట్టిన ర్యాలీ, మానవ హారంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అదేవిధంగా వాలంటీర్లు స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ప్లాస్టిక్ ను వినియోగించవద్దని, వ్యర్థాలను తొలగించి పర్యావరణాన్ని కాపాడాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. జెల్ల సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఆడిటోరియం సమీపంలో మానవ హారం నిర్వహించారు.

నేడు రక్తదాన శిబిరం ..

రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆసుపత్రి ఆవరణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. పీజేటీఎస్ఎయూ కళాశాల అసోసియేషన్ డీన్ డా. నరేందర్‌రెడ్డి ఆసుపత్రిని సందర్శించి పరిశీలించారు. ఎమ్ఎన్‌జీ డాక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రాన్ని అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 24: నగరంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రతినిధి బృందం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ నగర అధ్యక్షుడు ఆరుట్ల రాజ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి జేరుపోతుల కుమార్ మాట్లాడుతూ.. దళితుల సంక్షేమం కోసం తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. డీహెచ్‌పీఎస్ నేతలు పి.ఆంజనేయులు, సి.లక్ష్మి, స్వామి పాల్గొన్నారు.

విరిగిన చెట్లు.. తొలగించని అధికారులు

అత్తాపూర్ చింతకుంట పార్కులో విరిగిపడ్డ భారీ వృక్షం

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 24: పార్కులో చెట్లు విరిగి పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీత అన్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు వృక్షాలు విరిగి రాకపోకలకు ఇబ్బందులు కలగుతున్నా చోద్యం చూస్తున్నారని అన్నారు. అత్తాపూర్ డివిజన్ కాంతారెడ్డినగర్ కాలనీ చింతకుంట జీహెచ్ఎంసీ పార్కులో వృక్షాలు పడిపోవడంతో పార్కుకు ఉదయం సాయంత్రం వచ్చే వృద్ధులు, మహిళలకు వాకింగ్ చేయడం ఇబ్బందిగా మారిందని అన్నారు. మూడు రోజుల నుంచి జీహెచ్ఎంసీ యూసీడీ, డీఆర్ఎఫ్ శాఖల అధికారులకు విరిగిన చెట్లను తొలగించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలి

ఎంజీఐటీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, విద్యార్థులు

మణికొండ, సెప్టెంబర్ 24: విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా కళాశాలలో ప్లాంట్ ఫర్ మదర్, క్యాంపస్ క్లీనింగ్ ప్రొగ్రామ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కళాశాలలో మొక్కలను నాటి, కళాశాల ప్రాంగణం శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, మెంటెనెస్ ఇన్‌చార్జి డాక్టర్ బర్నాబాస్ పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : తిరుమల తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ మేకల వెంకటేశ్ ముదిరాజ్ మంగళదవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తుల పవిత్రతను దెబ్బతీసే కుట్రలో భాగంగా అన్యమతస్తులైన టీటీడీ బోర్డు సభ్యులు ఈ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. లడ్డూను స్వీకరిస్తే స్వామి వారి ఆశీస్సులు పొందిన్నట్లుగా భావించే హిందులపై అన్యమతస్తులు చేసిన దాడిగా దీన్ని పరిగణించి లడ్డూలో జంతువుల కొవ్వు ఇతర పాదార్థాలు కలిపి అపత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు వస్తే కాని స్పందించని ఎమ్మార్వో

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం వివాదంలో ఉండగా, కొందరు ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టు కేసు నడుస్తుండగా నే అక్కడ గదిని నిర్మించడంతో ఇటీవల ఓ వ్యక్తి ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. కాగా నిర్మాణాలు చేపట్టి నెలలు గడుస్తున్నా ఎమ్మార్వో స్పందించలేదని స్తానికులు ఆరోపిస్తున్నారు.

ఈవ్ టీజర్లకు 8 రోజుల జైలు శిక్ష

వెంగళరావునగర్, సెప్టెంబర్ 24: అసభ్యకర చేష్టలకు పాల్పడుతున్న ఇద్దరు ఈవ్ టీజర్లకు న్యా స్థానం 8 రోజుల జైలు శిక్ష విధించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం..మధురానగర్ లోని ఓ హాస్టల్‌లో నివసించే రాజేశ్‌బాబు రహదారి పై వెళ్లే మహిళల ముందు తన దుస్తుల్ని విప్పి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. దీంతో బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై కేసు నమోదు చేసి మంగళవారం నాంపల్లి 10 వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు.

హోటల్‌లో మహిళలపై ..

హోటల్‌లో పని చేసే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన రహ్మత్‌నగర్‌కు చెందిన డ్రైవర్ ఎండీ హషమ్ పై పోలీసులకు ఫిర్యాదు అందింది. హషమ్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి 10వ మెట్రోపాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇద్దరు ఈవ్ టీజర్లకు 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. దోషులిద్దరినీ జైలుకు తరలించారు.

స్వచ్ఛతాహీ సేవా ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, కార్మికులు

మణికొండ, సెప్టెంబర్ 24: మణికొండ 15వ వార్డులోని హనుమాన్‌నగర్‌లో స్వచ్ఛతాహీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు బుద్దోలు కావ్య శ్రీరాములు పాల్గొని ప్రజలు, కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటో కార్మికులకు అందించాలని అన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోలు శ్రీరాములు, హనుమాన్‌నగర్ కాలనీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు బషీర్, ఏర్పుల కుమార్, శ్రావణ్ కుమార్, గంగాధర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్స్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలోని కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించండి

బండ్లగూడ, సెప్టెంబర్ 24: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ చీఫ్ కంట్రోలింగ్ అధికారి రవీందర్‌ను బహుజన సాహిత్య అకాడమీ బెస్ట్ సర్వీస్ సొసైటి జాతీయ అవార్డు గ్రహీత మల్లారెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్, కాళీమందిర్ మీదుగా సాయిబాబా నగర్, డిఫెన్స్‌కాలనీ తదితర కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యం..

షిల్లాంగ్‌లో కార్పొరేటర్ కవితారెడ్డి తదితరులు

జూబ్లీహిల్స్,సెప్టెంబర్24: ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమని ఆసియాలోనే అత్యంత పరిశుభ్ర గ్రామంగా గుర్తింపు పొం దిన షిల్లాంగ్‌లోని మాప్లీనాంగ్‌లో పర్యటించిన కార్పొరేటర్ల బృందం గుర్తించింది. నగర మేయర్ నేతృత్వంలో నగరానికి చెందిన 40 మంది కార్పొరేటర్లు లక్నో, షిల్లాంగ్‌లలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ స్టడీ టూర్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్.. డిప్యూటీ మేయర్ శ్రీలత ఆధ్వర్యంలో షిల్లాంగ్‌లోని మాప్లీనాంగ్ స్వచ్ఛ గ్రామాన్ని సందర్శించారు. ఈ స్వచ్ఛ గ్రామంలో పరిశుభ్రత పాటించేందుకు గ్రామస్థులు అనుసరిస్తున్న విధానాలపై కా ర్పొరేటర్ల బృందం అధ్యయనం చేసింది. స్మార్ట్ సిటీ.. సేఫ్ సిటీ కోసం ఇక్కడ మున్సిపాలిటీలు అనుసరిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయని కార్పొరేటర్ మన్నె కవితా రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, మహిళల బద్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెట్ వంటి మూడు విభిన్న తరహా కార్యకలాపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల ద్వారా సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు.

టీఎస్ఎస్‌పీ వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభం

ఒత్తిడిలో విధులు నిర్వహించే పోలీసు ఉద్యోగులకు ఆట విడుపు అవసరమని టీఎస్ఎస్‌పీ ప్రథమ పటాలం కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మైదానంలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. – జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 24

పేద ప్రజల గొంతుక.. సీతారాం ఏచూరి

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 24: పేద ప్రజల గొంతుక సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఇటీవల మరణించిన ఏచూరి సంతాప సభ మంగళవారం హిమాయత్‌నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి సీపీఎం పార్టీకే కాకుండా అన్ని కమ్యూనిస్టు పార్టీలకు నాయకుడని అన్నారు. దేశంలోని అన్ని ఎర్ర జెండాలు ఏకతాటిపైకి వస్తే కమ్యూనిస్టులదే అధికారమని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమం నుంచి కమ్యూనిస్టు భావాలను ఉణికి పుచ్చుకుని దేశంలో ఎన్నో విప్లవాత్మక ఉద్యమంలో భాగ స్వాములయ్యారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో, ప్రజా పోరాటాలతో సంబంధం లేని బీజేపీ మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించి గద్దెనెక్కిందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.జి.నర్సింహారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, వనజ, మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్, బాలమల్లేశ్ పాల్గొన్నారు.

లేక్ వ్యూ పార్కు కొలనులో డ్రైనేజీ నీరు

పార్కు కొలనులోకలుస్తున్న డ్రైనేజీ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 24 : ఖైరతాబాద్ లేక్ వ్యూ పార్కు సామాన్య ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని పంచుతున్నది. నిత్యం వందలాది మంది వాకర్లు ఇక్కడకి వస్తుంటారు. పార్కులోని కొలనులో అనేక జీవరాశులతో పాటు ఇతర దేశాలకు చెందిన పక్షులు వచ్చి సేదతీరుతుంటాయి. ప్రస్తుతం ఆ కొలను డ్రైనేజీ నీటితో నిండిపోతున్నది. చుట్టు పక్కల ఉన్న కాలనీలకు సంబంధించిన మురుగునీరు చేరుతుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. జీహెచ్ఎంసీ సర్కిల్ 17 ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే స్వచ్ఛమైన నీటిలో డ్రైనేజీ, ఇతర వ్యర్థాలతో కూడిన నీరు కలుస్తున్నదని పలువురు వాకర్స్ ఆరోపించారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలి..

హిమాయత్‌నగర్, సె